

# విభారె


తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 05 జనవరి 2022 సంపుటి: 03 సంచిక: 128 పేజీలు: 4 వెల: రూ 3-00


## భారత వృద్ధిలో ప్రధాన డ్రైవర్లుగా ఈశాన్య రాష్ట్రాలు..

### మణిపూర్ లో మోదీ



ఢిల్లీ : మరో రెండు మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ లో ఇవాళ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటించారు. ఇవాళ ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మణిపూర్ రాజధాని ఇంఫాల్ ఎయిర్ పోర్ట్ కి చేరుకున్న మోదీకి..మణిపూర్ సీఎం ఎన్ బీరేన్ సింగ్,ఇతర అధికారులు,నేతలు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఇంఫాల్?లో రూ.4,815కోట్లు విలువ చేసే పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. 13 ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ర్యాలీలో మోదీ పాల్గొన్నారు. మోదీ మాట్లాడుతూ.."మణిపూర్ ప్రజల నుంచి ఇవాళ నేను అందుకున్న స్వాగతాన్ని ఎన్నటికీ మర్చిపోను. బీజేపీ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. కొన్నేళ్ల క్రితం వరకు మణిపూర్ లో కేవలం 6శాతం ప్రజలే తమ ఇళ్లల్లో పైప్డ్ వాటర్ ను అందుకునేవాళ్లు. కానీ నేడు జల్ జీవన్ మిషన్ ప్రోగ్రామ్ కింద ఆ నెట్ వర్క్ ను 60శాతానికి పైగా విస్తరించాం. నేడు రాష్ట్రంలో 60శాతానికి పైగా ఇళ్లకు పైప్డ్ వాటర్ కనెక్షన్ ఉంది. తర్వలో ప్రతి ఇళ్లు వాటర్ కనెక్షన్ కలిగి ఉంటుంది. డబుల్ ఇంజిన్ గవర్నమెంట్(కేంద్రంలో-రాష్ట్రంలో అధికారంలో) పవర్ ఇదే.రాష్ట్రంలో 30లక్షల కోవిడ్ వ్యాక్సిన్ డోసులను ఉచితంగానే ప్రజలకు అందిచడం జరిగింది. మీ(ప్రజలు)ఓటు వల్లనే ఇది సాధ్యమైంది. గతంలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు మణిపూర్ పట్ల నిర్లక్ష్యం చూపాయి. 2014లో నేను ప్రధానమంత్రిని అయిన తర్వాత ఢిల్లీని,మొత్తం కేంద్రప్రభుత్వాన్నే మణిపూర్ దగ్గరికి తీసుకొచ్చా. కేంద్రంలో అధికారంలో ఉన్న గత ప్రభుత్వాలు ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి ఓ పాలసీని పెట్టుకు న్నాయి. ."డోంట్ లుక్ ఈస్ట్"అనే పాలసీతో గత ప్రభుత్వాలు పనిచేశాయి.బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 2014లో అధికారంలోకి వచ్చాక యాక్ట్ ఈస్ట్ పాలసీ తీసుకున్నాం. నేను ప్రధాని కాకముందు మణిపూర్ చాలాసార్లు వచ్చాను. మణిపూర్ ప్రజల గుండెల్లో ఉన్న బాధ నాకు తెలుసు. కాబట్టే 2014 తర్వాత మొత్తం కేంద్రప్రభుత్వాన్నే మీ గుమ్మం ముందుకు తీసుకొచ్చా. 21వ శతాబ్దపు ఈ దశాబ్దం మణిపూర్ కి చాలా కీలకం. భారత వృద్ధిలో ఈశాన్య రాష్ట్రాలు ప్రధాన చోదకులుగా మారనున్నాయి"అని మోదీ అన్నారు.

## ముగిసిన సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన











ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. మంగళవారం పలువురు కేంద్రమంత్రులతో సీఎం భేటీ అయ్యారు. కేంద్ర రవాణా మంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం జగన్.. విశాఖ నుంచి భోగాపురం వరకు జాతీయ రహదారి ఏర్పాటుపై చర్చించారు. అలాగే కేంద్రమంత్రులు అనురాగ్ ఠాకూర్, ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం కలిశారు.కేంద్ర సమాచార, క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో సీఎం జగన్ భేటీ అరగంట పాటు కొనసాగింది. సమావేశంలో ఏపీలో క్రీడా మైదానాల అభివృద్ధి సహా పలు అంశాలపై చర్చించారు.కేంద్రమంత్రి గడ్కరీతో సీఎం వైఎస్ జగన్ సమావేశం సుమారు గంటపాటు సాగింది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులను మంజూరు చేసినందుకు సీఎం జగన్ ధన్యవాదాలు తెలిపారు. విశాఖపట్నం పోర్టు నుంచి రిషికొండ, భీమిలి మీదుగా భోగాపురం వరకూ జాతీయ రహదారి డీపీఆర్ తయారీ అంశంపై చర్చించారు. విశాఖపట్నానికి ఈ రహదారి చాలా ఉపయోగమని, విశాఖపట్నం పోర్టు నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వెళ్లే సరుకు రవాణా వాహనాలకు తక్కువ దూరం అవుతుందని సీఎం జగన్.. కేంద్ర మంత్రికి తెలిపారు.సముద్ర తీరాన్ని ఆనుకుని బీచ్‌కారిడర్ ప్రాజెక్టులకు సమీపం నుంచి ఈ రోడ్డు వెళ్తుందని సీఎం జగన్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చేరుకునేందుకు, ఈ ప్రాంతంలో పర్యాటకరంగం అభివృద్ధికి ఈ రోడ్డు నిర్మాణం అత్యంత దోహపడుతుందని కేంద్రమంత్రికి వివరించారు. విశాఖ నగరంలో వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 6 లేన్ల రహదారిని మంజూరు చేయాలని సీఎం జగన్ కోరారు.

## నా రాజకీయ చరిత్రలో ఇలాంటి పాలన చూడలేదు: చంద్రబాబు



గుంటూరు: నా రాజకీయ చరిత్రలో ఇలాంటి పాలన ఎప్పుడూ చూడలేదని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "వైసీపీ పాలనతో ప్రజలంతా నష్టపోతున్నారు. ఏపీ భవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ ఆలోచించాలి. రాష్ట్రంలో జరగబోయే నష్టాన్ని ప్రజలంతా గమనించాలి. రాష్ట్రంలో విధ్వంసంతో పరిపాలన ప్రారంభించారు.ప్రజల కోసం కట్టిన ప్రజావేదికను కూల్చారు. రాజధాని కోసం 50 వేల ఎకరాల భూమిని రైతులు ఇచ్చారు.రాజధానిలో రూ.10 వేల కోట్లు ఖర్చు పెట్టాం.గత ప్రభుత్వాలు ఇలాగే విధ్వంసం చేస్తే హైదరాబాద్ ఉండేదా?. ఎన్నికలకు ముందు అమరావతే రాజధాని అని చెప్పి మాట తప్పారు. కోట్ల ఆస్తిని విధ్వంసం చేస్తున్నప్పుడు ప్రజా చైతన్యం అవసరం.అమరావతి, పోలవరం అభివృద్ధి చెందితేనే ఏపీకి భవిష్యత్తు. పోలవరం డీపీఆర్‌ను ఎందుకు ఖరారు చేయలేకపోయారు?. పోలవరం పూర్తి చేయడం మీకు చేతనవుతుందా?. పోలవరంపై శ్వేతపత్రం ఇచ్చే ధైర్యం సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఉందా?. ఏపీకి ప్రాజెక్టులు తేవడం విధ్వంసం చేసినంత సులువు కాదు. రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ చేశాం. ఆ పెట్టుబడులు వస్తే 30 వేల మందికి ఉద్యోగాలు వచ్చేవి" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. "దేశానికి అన్నంపెట్టిన ఏపీలోనే వరి వేయొద్దని చెబుతు న్నారు.వైసీపీ పాలనలో రైతులు ఆత్మహ త్యలు చేసుకుంటున్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఏపీ 3వ స్థానంలో ఉంది. ఇంగ్లీష్ మీడియం అన్నారు, నాడు- నేడు అన్నారు.. టీచర్లు కావాలని పిల్లలు ఆందోళన చేసే పరిస్థితులు కల్పించారు. జాబ్ క్యాలెండర్ అన్నారు.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. ప్రజలు, మీడియా వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు పెడుతున్నారు.ప్రజా సమస్యలపై ఎవరు పోరాడినా దాడులకు దిగుతున్నారు" అని చంద్రబాబు ధ్వజమెత్తారు."నవరత్నాలు కాదు.. టీడీపీ ఎన్నో రత్నాలు ఇచ్చింది. పన్నుల పేరుతో ప్రజలపై తీవ్రమైన భారం మోపారు.చెత్తమీద కూడా పన్ను వేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌రెడ్డిది. అన్న క్యాంటీన్లను ఎందుకు మూసివేశారు?. రెండేళ్లలో కరెంట్ ఛార్జీలను ఆరుసార్లు పెంచారు. రాష్ట్రంలో మద్యంపై పెద్దఎత్తున దోపిడీ చేస్తున్నారు.మద్యపాన నిషేధ హామీ ఏమైంది?. ఒక్కరోజే రూ.124 కోట్ల మద్యం అమ్మకాలా?.ఇసుక, ఓటీఎస్ పేరుతో దోపిడీ చేస్తున్నారు.డ్రగ్ ఆంధ్రప్రదేశ్ అని ఇతర రాష్ట్రాలు అవమానించే పరిస్థితికి తెచ్చారు. కరోనాకు వ్యాక్సిన్ ఉంది.. జగన్ పాలనకు ఎలాంటి వ్యాక్సిన్ లేదు. జగన్‌కు తాను తప్ప ఎవరూ అక్కర్లేదు.. చెల్లి లేదు.. తల్లి లేదు" అని తీవ్రస్వరంలో చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సురేష్ సమీక్ష



అమరావతి: విద్యాశాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో జగనన్న విద్యాకానుకపై మంత్రి సురేష్ సమీక్ష జరిపారు. పాఠశాల విద్యా ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ సురేష్ కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ వెట్రిసెల్వి సమావేశానికి హాజరయ్యారు.

## నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టుంది కేసీఆర్ తీరు: షర్మిల

అమరావతి : 'నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టు ఉంది కేసీఆర్ తీరు' అని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ట్విటర్ వేదికగా ఎద్దేవా చేశారు. రైతులను బ్యాంకర్ల దృష్టిలో దొంగల్ని చేశారన్నారు. "నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టు ఉంది కేసీఆర్ తీరు. సర్కార్ రుణమాఫీ చేస్తుందని కేసీఆర్ గారిని నమ్మి గెలిపించారు. రైతులను బ్యాంకర్ల దృష్టిలో దొంగల్ని చేశారు. రుణం ఎగ్గొట్టే ఎగవేతదారులుగా చేశారు. చేసిన అప్పులకు వడ్డీ మీద వడ్డీ కట్టలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దొరగారికి రుణమాఫీ చేస్తామని చెప్పిన హామీ మాత్రం గుర్తుకు రాదు. లక్ష లోపు రుణమాఫీ అని చెప్పి మూడేళ్లు అయ్యింది. ఇప్పటి వరకూ మాఫీ చేసింది మూడు శాతం కూడా లేదు. రైతు రుణమాఫీ ఎగ్గొట్టి న చేతకాని ముఖ్యమంత్రి మనకు వద్దు" అని షర్మిల ట్వీట్‌లో పేర్కొన్నారు.



## హంద్రీనీవా నుంచి నీరిస్తున్నాం: మంత్రి బుగ్గన



కర్నూలు: సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు చెరువులకు హంద్రీనీవా నుంచి నీరిస్తున్నామని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. కృష్ణగిరి మండలం లక్కసాగరం వద్ద హంద్రీనీవా నుంచి 68 చెరువులకు నీటి మళ్లింపు ట్రయల్ రన్‌ను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. జగన్ ఇచ్చిన హామీ మేరకు 68 చెరువులకు హంద్రీ నీవా నుంచి నీరిస్తున్నామన్నారు. హంద్రీనీవా నుంచి నీటిని చెరువులకు మళ్లించడంపై మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. టీడీపీ హయాంలో 15 శాతం మాత్రమే పనులు చేస్తే, వైసీపీ అధికారంలోకి వచ్చాక 65 శాతం పనులను పూర్తి చేసామని బుగ్గన పేర్కొన్నారు.

## జీవో నెంబర్ 2ను ఉపసంహరించుకున్న ఏపీ సర్కార్

అమరావతి: జీవో నెంబర్ 2ను ఏపీ సర్కార్ ఉపసంహరించుకుంది. జీవో నెంబర్ 2పై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. సర్పంచ్, కార్యదర్శుల అధికారాలను వీఆర్‌ఓలకు బదిలీ చేస్తూ ఇచ్చిన జీవో-2ను సస్పెండ్ చేస్తూ గతంలో ఏపీ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని హైకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. గతంలో ప్రభుత్వం వేసిన కౌంటర్‌లో కొన్ని లోపాలున్నాయని వాటిని సవరించుకునే లోపే కోర్టుకు వెళ్లారన్న మంత్రి వ్యాఖ్యలపై హైకోర్టు ప్రశ్నించింది. అందుకు భిన్నంగా ప్రభుత్వం వెకేట్ చేయాలని కోరడం ఏంటని హైకోర్టు ప్రశ్నించింది. దీంతో పిటిషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు న్యాయవాది ప్రకటించారు. తదుపరి విచారణను ఈనెల 20కి హైకోర్టు వాయిదా వేసింది.

## అభివృద్ధి అజెండాగా సీఎం జగన్ ఢిల్లీ పర్యటన: గడికోట శ్రీకాంత్‌రెడ్డి



తాడేపల్లి: అభివృద్ధి అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన సాగిందని ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు కేంద్ర మంత్రులతో చర్చించారు. అయితేవాస్తవాలకు దూరంగా పరిపాలన సాగించిన ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు వాస్తవాలు చెబుతుంటే సహించలేకపోతున్నారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు.ఈ మేరకు ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు గ్రాఫిక్స్‌తో కాలం గడిపారు. రాజధాని కోసం చంద్రబాబు చేసిందేమీ లేదు. అక్కడ రూ.10వేల కోట్లు ఖర్చు పెట్టామంటున్నారు.. లెక్క చెప్పగలరా?. అమరావతిలో చంద్రబాబు సొంతిల్లు కూడా కట్టుకోలేదు. వాస్తవాలకు దూరంగా చంద్రబాబు పాలనసాగింది. రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు.

## విశాఖ సాగర తీరంలో ఉద్రిక్తత



విశాఖ: నగరంలోని సాగర తీరంలో ఉద్రిక్త వాతావరణం నెలకొ?ంది. చేపలను పట్టడానికి ఉపయోగించే రింగు వలలపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొని ఘర్షణ జరిగింది. మరో బోటును సాంప్రదాయ మత్స్యకారులు తగులబెట్టారు. మొత్తం నాలుగు బోట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. దీంతో కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. పోలీసులు ఒడ్డున ఉండగానే సముద్రంలో బోట్లను మత్స్యకారులు తగులబెట్టారు.

# సంపాదకీయం

బుధవారం 05 జనవరి 2022

## వాతావరణంపై తీవ్ర ప్రభావం

దేశమంతా గజగజ వణుకుతోంది. ఉత్తరాది నుంచి దక్షిణాది దాకా డిసెంబర్ నాటికే చలి పులి చేతికి చిక్కి, జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తీవ్రమైన శీతల గాలులతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. తత్ఫలితంగా తలెత్తుతున్న అనారోగ్య పరిణామాలు ఆందోళన రేపుతున్నాయి. దేశరాజధానిని చలి గాలి బలంగా తాకింది. ఢిల్లీలో ఈ సీజన్‌లోకెల్లా అతి తక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. కొద్దిరోజులుగా శ్రీనగర్‌లో వరుసగా రెండు రాత్రుళ్ళు మైనస్ 6 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పడిపోయింది. రాజస్థాన్‌లోని చురూలో ఏకంగా మైనస్ 0.5 డిగ్రీలకు వచ్చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో హైదరాబాద్ సహా అనేక ప్రాంతాలు చలితో గడగడలాడుతున్నాయి. శీతల, అతి శీతల గాలుల గుప్పెట్లో ఉత్తర భారతావని ఉందని భారత వాతావరణ శాఖ శనివారం ప్రకటించింది. కొద్ది రోజుల పాటు బాధలు తప్పవని హెచ్చరించింది. ఢిల్లీ, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, జమ్ము ? కాశ్మీర్, లద్ధాఖ్, గిల్గిత్ ? బాల్టిస్తాన్, ముజఫరాబాద్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లు ఇప్పటికే తీవ్రమైన చలి గాలుల్లో చిక్కుకున్నాయి. మార్గశిర, పుష్య మాసాల హేమంత ఋతువులో శీతల పవనాలు, హిమ శీకరాలు సాధారణమే. కానీ, ప్రకృతి కోపించినట్లు ఇంతలేసి చలి మాత్రం ఇటీవలి అసాధారణం. 1991 నుంచి 2019 మధ్య మూడు దశాబ్దాల్లో శీతల గాలులు విజృంభిస్తున్నాయనీ, గత రెండు దశాబ్దాల్లో 4,712 మంది చనిపోయారనీ అధికారిక లెక్క. మానవ తప్పిదాల వల్ల ఎండాకాలంలో ఎండ, వానాకాలంలో వాన, శీతకాలంలో చలి ? మూడూ దుర్భరస్థాయికి ఎగబాకడం ఇప్పుడు ప్రపంచవ్యాప్త ఆందోళనకర పరిణామం. ఉష్ణోగ్రతల్లోని భారీ మార్పులు వ్యవసాయం, పశుసంపద, జీవనోపాధి, పర్యావరణం, ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. సాక్షాత్తూ ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) ఆ మాట చెప్పింది. వర్ధమాన దేశాల్లో ఏటా పెద్ద సంఖ్యలో మరణాలూ సంభవిస్తున్నాయి. ఉత్తర భారతావనిలో కొండ ప్రాంతాలు, వాటిని ఆనుకొన్న మైదానాలతో 17 రాష్ట్రాలలో 'ప్రధానమైన శీతల గాలుల జోన్' విస్తరించి ఉంది. దాదాపు 90.90 కోట్ల జనాభా ఈ జోన్‌లోనే జీవిస్తోంది. వీరిని బాధిస్తున్న శీతల గాలులపై ఎక్కడికక్కడ యాక్షన్ ప్లాన్లు సిద్ధం చేసుకొనేందుకు 'జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ' (ఎన్‌డీఎంఏ) ఈ ఏప్రిల్‌లో మార్గదర్శకాలను విడుదల చేసింది. వాటిని ఎవరు, ఎంత వరకు ఆచరణలో పెట్టారో ఇప్పటికిప్పుడు చెప్పడం కష్టమే. కనిష్ఠ ఉష్ణోగ్రత మైదాన ప్రాంతాల్లో 10 డిగ్రీల కన్నా తగ్గినా, పర్వత ప్రాంతాల్లో సున్నా డిగ్రీల కన్నా తగ్గినా అది 'శీతల గాలి' పరిస్థితి అని భారతీయ వాతావరణ శాఖ లెక్క. మరోలా చెప్పాలంటే, సాధారణ ఉష్ణోగ్రత కన్నా 4.5 నుంచి 6.4 డిగ్రీలు తగ్గితే ? కోల్డ్ వేవ్. 6.4 డిగ్రీలకు మించి తగ్గితే, తీవ్రమైన కోల్డ్ వేవ్. దేశంలో అనేక చోట్ల ఇప్పుడీ పరిస్థితే ఉంది. తలదాచుకొనే గూడు, ఒంటి నిండా వస్త్రాలు లేని అధిక శాతం మందికి జీవన్మరణ సమస్యగా పరిణమించింది. అనారోగ్య సమస్యలతో ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక ఎయిమ్స్ వైద్య సంస్థలో వైద్యం కోసం వచ్చిన రోగులు, వారి కుటుంబాలు పడకలు ఖాళీ లేక, చలిలో రోడ్డు మీద తాత్కాలిక గుడారాలు వేసుకొని, కాలక్షేపం చేస్తున్న దయనీయ దృశ్యాలు జాతీయ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. కొన్నేళ్ళుగా ప్రతి ఏటా దర్శనమిస్తున్న ఈ దృశ్యాలు ఈసారీ షరా మామూలు కావడం విషాదం. ప్రభుత్వాలు, పాలకుల పాత్ర ఇక్కడే కీలకం. తలదాచుకొనేందుకు నీడ లేని నిర్భాగ్యులను ఎముకలు కొరికే చలికి వదిలేయడం ఏ రకంగా చూసినా ధర్మం కాదు. నిజానికి, నిరాశ్రయులకు దేశంలో మరే నగరంలోనూ లేనన్ని షెల్టర్లున్నది దేశ రాజధానిలోనే! ఈసారి కూడా నిరాశ్రయులను చలి కోరల నుంచి కాపాడేందుకు ఢిల్లీలోని కేజ్రీవాల్ సర్కార్ నవంబర్‌లోనే యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించింది. మొన్న నవంబర్ 7 నుంచి వచ్చే మార్చి 15 వరకు ఆ ప్లాన్‌ను అమలులో పెడతామంది. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న 206 షెల్టర్లలో 7092 మందికి ఆశ్రయమిచ్చే అవకాశం ఉంది. కొత్తగా మరో 2 వేల మందికి, 250 తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేయాలని ఢిల్లీ సర్కార్ సంకల్పించింది. చాపలు, దుప్పట్లు, లాకర్లు, కాలకృత్యాలకు వసతులు ? అన్నీ కల్పిస్తా మన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో అనేక లోటుపాట్లున్నట్టు జాతీయ మానవ హక్కుల సంఘం సహా అనేక ఎన్జీఓల పరిశీలనలో వెల్లడైంది. నిరాశ్రయుల సంఖ్యకు తగ్గట్టు షెల్టర్లు లేవు. ఉన్నవి కూడా దయనీయావస్థలో ఉన్నాయి. అవసరార్థులకు సమీప షెల్టర్ల సమాచారం చెప్పే పరిస్థితి లేదు. తెలిసి వెళ్ళినా, రాత్రి 8 గంటల వేళకే జనంతో నిండిపోతున్నాయి. చాలామందికి జాగా లేని దుఃస్థితి. దాదాపుగా దేశంలోని ప్రతి నగరంలోనూ నిర్భాగ్యులకు ఎదురవుతున్నది ఇలాంటి నిర్లక్ష్యమే! అసలు ఇలాంటి అభాగ్యులకు నిలువ నీడ కల్పించడానికి 'జాతీయ పట్టణప్రాంత జీవనోపాధి ప్రణాళిక ? పట్టణప్రాంత నిరాశ్రయులకు ఆవాసం' పేరిట ఓ జాతీయ ప్రణాళిక ఉంది. సుప్రీమ్ కోర్టు మార్గదర్శకాల ప్రకారమైతే, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిరాశ్రయులకోసం గౌరవప్రదమైన, శాశ్వత షెల్టర్లను నిర్మించడం చట్టప్రకారం విధాయకం. కానీ, స్థానిక, రాష్ట్ర సర్కార్లు ఏ మేరకు చొరవ చూపుతున్నాయి? ఇప్పటికైనా ఢిల్లీ నుంచి గల్లీ దాకా ప్రభుత్వాలు కాగితంపై ఉన్న కేంద్రీయ విధానాన్నీ, కోర్టు మార్గదర్శకాలనూ తు.చ. తప్పక కార్యాచరణలో పెట్టాలి. అప్పుడే ఈ చలి పులి పంజా విసురు నుంచి నిర్భాగ్యులు తప్పించుకోగలుగుతారు.

# కార్పొరేషన్ గా అమరావతి



గుంటూరు, జనవరి 4, (న్యూస్ పల్స్)ఎట్టకేలకు అమరావతి రాజధాని ప్రాంతాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు సిద్ధమైంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ఏపీ రాజధాని అమరావతిని నగరపాలక సంస్థగా మార్చే దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమరావతి క్యాపిటల్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్(ఏసిసిఎంసి)గా మార్చనుంది. ఇందులో భాగంగా రాజధానిలోని 19 గ్రామాలను ఈ కార్పొరేషన్ పరిధిలో చేర్చనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ నుంచి నోటిఫికేషన్ విడుదలైంది. తుళ్లూరు మండలంలోని 16 గ్రామాలు, మంగళగిరి మండలంలోని 3 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తుళ్ళూరు మండలంలోని 16 గ్రామాలను అమరావతి మున్సిపల్ సిటీ కార్పొరేషన్ (ఏసిసిఎంసి)లో విలీనం చేసేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కలెక్టర్‌ను ఆదేశించింది ప్రభుత్వం. దాని ప్రకారమే నోటిఫికేషన్ ఇచ్చారు గుంటూరు జిల్లా కలెక్టర్. ఇదిలావుంటే ఏపీ రాజధాని తరలింపుపై మెత్తబడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి ప్రజలకు శుభవార్త చెప్పారు. రాజధాని అమరావతి ప్రాంతంలో శాసన రాజధానిని ఏర్పాటు చేస్తామని.. విశాఖపట్నంకు పరిపాలనా రాజధానిని తరలిస్తామని సీఎం జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం జగన్ ప్రకటన పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న అమరావతి ప్రాంత రైతులు.. ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ తరుణంలోనే మూడు రాజధానుల బిల్లులను రాష్ట్ర అసెంబ్లీలో ఉపసంహరించుకున్న జగన్ ప్రభుత్వం కొంతకాలంగా సైలెంట్‌గా ఉంది. ఈ నేపథ్యంలో అమరావతి ప్రాంత ప్రజలకు జగన్ సర్కారు శుభవార్త చెప్పింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతాన్ని నగరపాలక సంస్థగా ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాజధాని నగరం పేరుతో కార్పొరేషన్‌గా మారుస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాజధానిలోని 19 గ్రామాలను అమరావతి క్యాపిటల్ సిటీ కార్పొరేషన్‌గా మార్చనున్నారు. ఈ మేరకు గ్రామ సభల నిర్వహణకు గుంటూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తుళ్లూరు మండలంలో 16, మంగళగిరి మండలంలోని 3 గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని సంబంధిత అధికారులను గుంటూరు కలెక్టర్ ఆదేశించారు. దీంతో త్వరలోనే అమరావతి ప్రాంతంలోని 19 గ్రామాలు క్యాపిటల్ సిటీగా మారనున్నాయి

# కాపులకు రాజయోగం ఉందా

కాకినాడ, జనవరి 4, (న్యూస్ పల్స్)సీఎం. . ఈ పదం.. ఈ పదవి ఏపీ కాపులకు అందని ద్రాక్షా. ప్రతి పదేళ్లకోసారి ఆ వర్గం నుంచి ఓ నేత రాజకీయాల్లోకి రావడం .. ఫెయిల్ కావడం జరిగిపోయాయి. అదే ఇప్పుడు ఆ సామాజికవర్గంలో ఆందోళన కలిగిస్తోందట. చిరంజీవి.. పవన్ పొలిటికల్‌గా ఫెయిల్ అయ్యారు. ఇక మనకు రాజయోగం లేదా అనే ఆందోళనలో కొత్త వ్యూహంపై దృష్టిసారించారట. ఏపీలో కాపులు సంఖ్యా పరంగా పెద్ద సామాజికవర్గం. ఏదో ఒక పార్టీలో ఉంటూ.. రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులతో సరిపెట్టుకునేవారు. చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించడంతో ఆ సామాజికవర్గానికి ఆశ కలిగింది. అయితే చిరంజీవి నిలబడలేదు. 18 ఎమ్మెల్యే సీట్లు వచ్చినా.. కాంగ్రెస్‌లో విలీనం కావడంతో కాపులు ఇబ్బంది పడ్డారు. తర్వాత వచ్చిన జనసేన అట్టర్‌ఫ్లాప్ అయింది. స్వయంగా పవన్ కల్యాణ్ పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయారు. ఇది కాపు సామాజికవర్గాన్ని మరింత నిరాశపర్చింది. ఇప్పుడు ఎన్నికలైన రెండున్నరేళ్ల తర్వాత కాపులు మళ్లీ చర్చల్లోకి వచ్చారు. ఎక్కువ జనాభా ఉండి.. అధికారాన్ని అందుకోలేకపోతున్నామనే బాధ ఏమూలో దాగి ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు ప్రారంభించారు. కాపు సామాజికవర్గంతో కలిసి వచ్చే కులాలను కలుపుకొని వెళ్లాలని అనుకుంటున్నారట. కమ్మేతర, రెడ్డేతర కులాలను ఏకం చేస్తే అధికారంలోకి రావడానికి శక్తి సరిపోతుందని లెక్కలు వేస్తున్నట్టు సమాచారం. వివిధ పార్టీలలో ఉన్న కాపు సామాజికవర్గం నాయకులు ఈ దిశగా అడుగులు వేసి.. ఇటీవల హైదరాబాద్‌లో సమావేశాలు నిర్వహించారు. ఆ సమావేశాలకు టీడీపీ నుంచి టీడీపీ నుంచి గంటా శ్రీనివాసరావు, వంగవీటి రాధాకృష్ణా, బీజేపీ నుంచి ఆ పార్టీ ఏపీ మాజీ చీఫ్ కన్నా లక్ష్మీనారాయణ, కేవీరావు, జనసేన నుంచి తోట చంద్రశేఖర్, తమిళనాడు మాజీ సీఎస్ రామ్మోహన్‌రావు, మేథావి వర్గం నుంచి జేడీ లక్ష్మీనారాయణ, పీవీ రావు, కాపు ఉద్యమ జేసీ నుంచి ఆరేటి ప్రకాష్, కాపు ఉద్యోగుల సంఘం నాయకుడు ఓఊరావు తదితరులు హాజరయ్యారు. ఇతర కులాల ప్రముఖులతో మాట్లాడేందుకు నలుగురితో కమిటీ కూడా వేశారట. ఆ కమిటీలో తోట చంద్రశేఖర్, ఆరేటి ప్రకాష్ ఉన్నారు. రెండు రోజులు గ్యాప్ తీసుకుని హైదరాబాద్‌లోనే ఒక కాపు నాయకుడి ఇంట్లో మరో భారీ మీటింగ్ నిర్వహించారు. మరికొన్ని పార్టీలకు చెందిన కాపు నాయకులతోపాటు.. కాపు సామాజికవర్గానికి చెందిన పారిశ్రామిక వేత్తలు ఆ మీటింగ్‌కు వచ్చారు. టీడీపీ, వైసీపీలు కాకుండా ప్రత్యామ్నాయ కూటమి రావాల్సి ఉందని కాపు కుల పెద్దలు అభిప్రాయపడ్డారట. అయితే భిన్నాభిప్రాయాలు కలిగిన పార్టీలలో ఉన్న కాపు నాయకులు ఎంత వరకు కలిసి సాగగలరు? ఈ స్థాయిలో కాకపోయినా గతంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. అవి ఫలించలేదు. కానీ.. ఈసారి కాపు పారిశ్రామిక వేత్తలు, వివిధ పార్టీలలోని కాపు నాయకులు ఏకమై ఏదో చేయాలని అనుకుంటున్నారట. అయితే వివిధ పార్టీలలో ఉంటున్న కాపు నాయకులు.. ప్రత్యామ్నాయ కూటమిని ఎలా లీడ్ చేస్తారన్నది ప్రశ్న. ఒకవేళ సమావేశంలో నిర్ణయం తీసుకున్న ప్రకారం అజెండా అమలు చేయాలంటే గంటా, కన్నాలాంటి వాళ్లు తమ పార్టీలను వదిలి బయటకు రావాల్సి ఉంటుంది. కన్నా బీజేపీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి బయటకొచ్చారు. ఇప్పుడు బీజేపీ వదలి వస్తారా? అలా కానప్పుడు ప్రత్యామ్నాయ కూటమి వర్కవుట్ అవుతుందా అన్నది ప్రశ్న. హైదరాబాద్‌లో ఈ మీటింగ్స్ జరుగుతున్న సమయంలో కిర్లంపూడిలో ముద్రగడతో కొందరు బీసీ, ఎస్సీ నేతలు సమావేశం అయ్యారు. అక్కడ కూడా కొత్త రాజకీయ కూటమిపైనే చర్చలు జరిగాయి. హైదరాబాద్, కిర్లంపూడి సమావేశాలకు సంబంధం లేదని కొందరు కాపు పెద్దలు చెబుతున్నా.. ఆ రెండుచోట్ల నుంచి వచ్చిన టోన్ ఒకేలా ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీలో అధికార వైసీపీ బలంగా ఉంది. ఆ పార్టీ నుంచి హైదరాబాద్‌లో కాపు మీటింగ్‌కు ఎవరైనా వచ్చారా లేదా అన్నది బయటకు చెప్పడం లేదు. మరి.. కాపు కుల పెద్దల నిర్ణయానికి వైసీపీలో ఉన్న కాపు నాయకులు రియాక్షన్ ఏంటి? పీఆర్పీ ప్రయోగం ఫలించక ఇబ్బంది పడ్డ సగటు కాపు సామాజికవర్గం.. కొత్త కూటమికి ఎంత వరకు ఆమోదం తెలియజేస్తుంది? వివిధ పార్టీలలో కొనసాగుతూనే నానాజాతి సమితిగా ముందుకెళ్తామంటే కొత్త ప్రయోగం వర్కవుట్ అవుతుందా అన్నది ప్రశ్నే. అలా కానప్పుడు తమ సామాజికవర్గాన్ని కాపు కాస్తారా లేక ఇంకేదైనా పార్టీకి కాపుకాస్తారో చూడాలి. మరి.. కాపు సామాజికవర్గ పెద్దలు హైదరాబాద్‌లో వేసిన అడుగులు.. ఏపీకి చేరేసరికి ఎలా ముందుకెళ్తాయో చూడాలి.

# వైసీపీలో 30 చోట్ల కుమ్ములాటలు



విజయవాడ, జనవరి 4, (న్యూస్ పల్స్)వైసీపీలో కుమ్ములాటలు మొదలయిపోయాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ అధికార పార్టీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఎక్కువగా కన్పిస్తుంది. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతతో పాటు పార్టీ లో కూడా వర్గాలుగా ఏర్పడి ఎమ్మెల్యేకు దూరమవుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేలపై సొంత పార్టీలో వ్యతిరేకత ఉన్న చోట అభ్యర్థులను మార్చక తప్పదన్న సంకేతాలు పార్టీ అధినాయకత్వం నుంచి వెలువడుతున్నాయి. దాదాపు ముప్ఫయి నుంచి నలభై నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఉంది. వైసీపీ ఎమ్మెల్యేలను ఆ పార్టీ నేతలే వ్యతిరేకిస్తున్నారు. కారణం ఆధిపత్య పోరు. గత ఎన్నికల్లో ఆర్థికంగా ఎమ్మెల్యే గెలుపుకోసం అన్నీ పోగొట్టుకుంటే అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విస్మరిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. దీంతో పాటు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుండటంతో ఇటీవల కాలంలో బహిరంగంగానే ఎమ్మెల్యేలపై తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తున్నారు మనకు పైకి కన్పించేది పాయకరావు పేట మాత్రమే కావచ్చు. నిజమనిపించేది నందికొట్కూరు అని పించవచ్చు. కానీ అనేక నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గ్రూపులు బయలుదేరాయి. వచ్చే ఎన్నికల్లో వీరినే అభ్యర్థులగా ఖరారు చేస్తే అసంతృప్త నేతలు పార్టీ విజయానికి పనిచేయకపోవచ్చు. అలాగని అందరినీ తప్పించేయడమూ కష్టమే. సుమారు ముప్ఫయి నియోజకవర్గాల్లో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేలను మార్చకతప్పదంటున్నారు. ఉదాహరణకు తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని తీసుకుందాం. ఆమెకు సొంత పార్టీ నుంచే అసమ్మతి సెగలు మామూలుగా లేవు. ఆమెను మార్చకపోతే ఆ సీటును అధికారపార్టీ కోల్పోయినట్లే. ఇక్కడ ఎంపీ నందిగం సురేష్ బాబు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ వర్గాలుగా విడిపోవడంతో ఆమెకు టిక్కెట్ ఇస్తే వీరిద్దరూ సహకరించరన్నది బహిరంగ రహస్యం. అలాగే నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తున్నారు. ఇలా దాదాపు 30 నియోజకవర్గాల్లో సిట్టింగ్ లకు ముప్పు తప్పేట్లు కన్పించడం లేదు.

# జేసి సోదరులు.. లెక్కేంటీ..

అనంతపురం, జనవరి 4, (న్యూస్ పల్స్)జేసీ సోదరులు రాజకీయంగా కొంత ఒక్క అడుగు వెనక్కు వేసినట్లే కనిపిస్తుంది. గతంలో ఉన్న దూకుడు ఇప్పుడు లేదు. వాళ్లు టీడీపీలోనూ సంతృప్తికరంగా లేరు. వారికి టీడీపీ తప్ప మరో దారి లేదు. అందుకే కష్టంగానైనా టీడీపీలోనైనా కొనసాగేందుకే నిర్ణయించుకున్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డిపై పార్టీ విధించిన ఆంక్షలను వారు జీర్ణించుకోలే?కపోతున్నారు. తమకు బలమున్న నియోజకవర్గాలకు సయితం వెళ్లవద్దంటూ తమను నిరోధించడమేంటన్న ప్రశ్నలు వారి వర్గం నుంచి వెలువడుతున్నాయి. జేసీ సోదరులిద్దరూ రాజకీయాల నుంచి గత ఎన్నికల నుంచి తప్పుకున్నారు. తమ వారసులకు టిక్కెట్లు ఇప్పించుకున్నారు. కానీ గెలుపు సాధ్యం కాలేదు. అయితే తాడిపత్రి మున్సిపల్ ఎన్నికల్లో స్వయంగా జేసీ ప్రభాకర్ రెడ్డి రంగంలోకి దిగడంతో ఆయన విజయం సాధించారు. ఇప్పుడు అదే వారి కుటుంబంపై పార్టీ అధినాయకత్వం నుంచి మరో షరతు వచ్చే అవకాశముందని తెలుస్తోంది. తాడిపత్రి నుంచి తిరిగి జేసీ ప్రభాకర్ రెడ్డినే పోటీ చేయించాలని చంద్రబాబు భావిస్తున్నారు. జేసీ అస్మిత్ రెడ్డి కన్నా జేసీ ప్రభాకర్ రెడ్డి అయితేనే వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి పై విజయం సాధిస్తారన్న సర్వే రిపోర్టులను చంద్రబాబు చూపిస్తున్నారట. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నా సర్వే చేసినప్పటికి జేసీ ప్రభాకర్ రెడ్డినే పోటీ చేయించాలని చంద్రబాబు నిర్ణయించారట. ఈసారికి ఆయనను పోటీ చేయించాలని, ఆ తర్వాత అస్మిత్ రెడ్డి రాజకీయ భవిష్యత్ కు తాను అండగా ఉంటానని చంద్రబాబు చెబుతున్నారని తెలిసింది ఇక అనంతపురం పార్లమెంటుకు మాత్రం జేసీ పవన్ కుమార్ రెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జేసీ దివాకర్ రెడ్డి ఇప్పటికే రాజకీయ సన్యాసం తీసుకున్నట్లు ప్రకటించడం, ఆయన పోటీకి విముఖత చూపుతుండటంతో పవన్ కుమార్ రెడ్డిని బరిలో దింపేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. తాడిపత్రిలో మాత్రం జేసీ ప్రభాకర్ రెడ్డికే అవకాశం అని చెబుతున్నారు.

# అచ్చెన్నా.. ఇది తగునా

శ్రీకాకుళం, జనవరి 4, (న్యూస్ పల్స్)వైసీపీ గాలిలోనూ శ్రీకాకుళం జిల్లాలో ఎమ్మెల్యేగా గెలిచిన ఇద్దరు టీడీపీ నేతల్లో అచ్చెన్నాయుడు ఒకరు. ప్రస్తుతం ఏపీ టీడీపీ అధ్యక్షుడు కూడా. గత ఎన్నికల్లో టెక్కలి స్థానాన్ని ఆయన నిలబెట్టుకున్నారు. నియోజకవర్గంలో టీడీపీకి గట్టి పట్టు ఉన్నా.. ఆ పార్టీ కేడర్ మాత్రం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. వైసీపీ రాజకీయ ఎత్తుగడలకు అచ్చెన్నతోపాటు పార్టీ కేడర్ ఉక్కిరి బిక్కిరైన ఉదంతాలు ఉన్నాయి. ఈ కష్ట సమయంలో తమ ఎమ్మెల్యేను కలిసి బాధలు చెప్పుకొందామని టీడీపీ కేడర్ భావించినా ఆయన అందుబాటులో ఉండటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. తమ ఎమ్మెల్యే ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారని ఆనందించాలో.. తమకు పిలిస్తే పలికేంత దూరంలో లేరని బాధపడాలో అర్థం కావడం లేదని అంటున్నారు. ప్రస్తుతం టెక్కలిలో టీడీపీ కేడర్ చాలా ఇబ్బంది పడుతోంది. చాలా మంది బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఇంటికే పరిమితం. వైసీపీ అధికారంలోకి వచ్చాక అచ్చెన్నాయుడు రెండు సార్లు జైలుకెళ్లడంతో.. తమ నాయకుడికే ఇలా ఉంటే.. మన పరిస్థితి ఏంటి? అని ఆందోళన చెందారు. ప్రస్తుతం టెక్కలిలో వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హవా నడుస్తోంది. ఇంతలో ఏపీ టీడీపీ అధ్యక్షుడైన తర్వాత అచ్చెన్న బిజీ అయిపోయారు. టెక్కలికి.. ఇక్కడ టీడీపీ కేడర్‌కు సమయం కేటాయించలేకపోతున్నారు. ఎక్కువ సమయం విజయవాడ లేదంటే విశాఖకే పరిమితం అవుతున్నారట అచ్చెన్నాయుడు. ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా టెక్కలిలో అచ్చెన్న మార్కు కనిపించడం లేదన్నది కేడర్ చెప్పేమాట. జిల్లాలో కింజరాపు కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎర్రన్నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నా పార్టీ కేడర్‌కు సమయం కేటాయించేవారని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు అచ్చెన్న నుంచి అదే ఆశించిన టీడీపీ తమ్ముళ్లకు నిరాశ తప్పడం లేదని అంటున్నారు. తమ నేతను కలుసుకోవాలంటే విజయవాడ, లేదా విశాఖపట్నం వెళ్లాల్సి ఉంటుందని చెబుతున్నారు కార్యకర్తలు. అందుకే మా అచ్చెన్న టెక్కలిని మర్చిపోయారని కేడర్ చెవులు కొరుక్కుంటోందట. నలుగురు కార్యకర్తలు కలిస్తే తమ బాధలు ఒకరికి ఒకరు చెప్పుకొని ఊరట చెందుతున్నారట. మరి.. ఈ విషయాన్ని అచ్చెన్నాయుడు గమనించారో లేదో..?

# హైటెక్ కోడి పందాలు..?



రాజమండ్రి, జనవరి 4, (న్యూస్ పల్స్)తెలుగు వారి లోగిళ్ళలో పెద్ద పండగ సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. మూడు రోజులు ఘనంగా జరుపుకునే ఈ పండగ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు. సంక్రాంతి రోజుల్లో గోదావరి జిల్లాల్లో కనిపించేది కోడి పందాలు. నెల రోజుల ముందునుంచే పందెంరాయుళ్లు తమ కోళ్లకు కత్తులు కట్టి బరిలో దింపడానికి రెడీ అయిపోతుంటారు. తూర్పుగోదావరి జిల్లాలోని పలు చోట్ల కోడి పందాల బరులను నిర్వాహకులు రెడీ చేశారు. వివరాల్లోకి వెళ్తే..కోనసీమలోని ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికొన, పల్లంకుర్రు మండలాల్లో సంప్రదాయం ముసుగులోనిర్వాహకులు కోడి పందాలకు బరులు రెడీ చేస్తున్నారు. గత నాలుగేళ్ళుగా ఐ.పోలవరం మండలంలో ఫ్లడ్ లైట్లు, డ్రోన్ కెమెరా చిత్రీ కరణ నడుమ కోడి పందాలను హైటెక్ పద్దతిలో నిర్వహిస్తున్నారు. ఇక ఈ ఏడాది కాట్రేనికోన మండలం పల్లంకుర్రులో కోడి పందాలు నిర్వహించడానికి భారీ ఏర్పాట్లను చేస్తున్నారు. పల్లంకుర్రులో పందెంరాయుళు పది ఎకరాల్లో పందాలు నిర్వహించడానికి బరులు రెడీ చేస్తున్నారు. అయితే ఈ కోడి పందాలకు అనుమతులు ఇవ్వాలని రాజకీయనాయకులపై స్థానిక నేతలు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఓ వైపు జిలాల్లో సంక్రాంతి కి జోరుగా బెట్టింగ్ బంగార్రాజులు కోళ్లతో రెడీ అయిపోతుంటే.. మరో వైపు జిల్లా పోలీసులు పందెంరాయుళ్లపై కన్నెర్రజేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో కోడి పందాలను జరగనివ్వమని పోలీసులు చెబుతున్నారు. అయితే మరో వైపు గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో జరిగే కోళ్ల పందాలను చూడడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు బెంగళూరు తదితర ప్రాంతల నుంచి వచ్చే వారి కోసం పందెంరాయుళ్లు ఇప్పటికే యానాం, అమలాపురం ప్రాంతాల్లో ఇప్పటికే వసతి గదులు బుకింగ్ చేశారు

# సంక్రాంతి... తర్వాత ఉద్యోగులు ఆందోళన

విజయవాడ, జనవరి 4, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ కు సంక్రాంతి పండగ తర్వాత ఇబ్బందులు ఎదురు కాబోతున్నాయి. ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. పీఆర్సీ పై స్పష్టత రాకపోవడంతో ఉద్యోగ సంఘాలు ఆందోళన చేయాలని నిర్ణయించాయి. గత నెల రోజుల నుంచి ప్రభుత్వం పీఆర్సీపై నానుస్తూ వస్తోంది. చర్చల పేరిట కాలయాపన చేస్తుందని ఉద్యోగ సంఘాలు గట్టిగా నమ్ముతున్నాయి. పీఆర్సీపై ప్రభుత్వం ఇప్పట్లో స్పష్టత ఇచ్చే అవకాశం లేదని వారు భావిస్తున్నారు. దీంతోపాటు తాము దశల వారీగా ఇచ్చిన ఆందోళనను సయితం విరమింప చేశారు. చీఫ్ సెక్రటరీతో చర్చల సందర్భంగా ఉద్యోగ సంఘాల చేత ఆందోళనను విరమింప చేశారు. ఇందుకు కారణం కూడా బలంగా ఉండటంతో ఉద్యోగ సంఘాలు కూడా ఆందోళనను విరమించడానికి సిద్ధపడ్డాయి. ముఖ్యమంత్రి జగన్ తో చర్చలు ఉంటాయని, అక్కడకు నల్ల బ్యాడ్జీలు ధరించి వెళితే మంచిది కాదని సీఎస్ చెప్పడంతోనే వారు విరమణకు ఓకే చెప్పారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం తీరు చూస్తుంటే పీఆర్సీతో పాటు తాము ఉంచిన 70 డిమాండ్లను కూడా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడాన్ని ఉద్యోగ సంఘాలు సీరియస్ గా తీసుకున్నాయి. ఈ నెల 9వ తేదీ తర్వాత తిరిగి ఉద్యమించాలని నిర్ణయించాయి. ఉద్యోగ సంఘాల ఐక్య జేఏసీ సమావేశమై కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యమాన్ని జిల్లా స్థాయిలో నిర్వహించి, తర్వాత చలో విజయవాడకు కూడా ప్లాన్ చేశాయి. ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేయాలని డెసిషన్ తీసుకున్నాయి. ఆఖరి అస్త్రంగా సమ్మెకు వెళ్లాలని నిర్ణయించాయి. సంక్రాంతి తర్వాత జగన్ కు ఉద్యోగుల నుంచి ఝలక్ తప్పదంటున్నారు.

# ముందుకు సాగని భూసర్వే

విజయవాడ, జనవరి 4, (న్యూస్ పల్స్)సమగ్ర భూ సర్వే- శాశ్వత భూ హక్కు ప్రాజెక్టులో గ్రామసచివాలయ సర్వేయర్లు కీలకంగా మారారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో ప్రభుత్వం ఒకేసారి 11,187మందిని నియమించింది. సమగ్ర సర్వేలో గ్రామసర్వేయర్లను వినియోగించుకోవడం ప్రభుత్వానికి తప్పని సరైంది. సర్వేయర్లుగా నియమాకాలు కావడం కొత్త కావడంతో ఆయా అభ్యర్ధులకు ప్రభుత్వం తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సర్వే అకాడమిలో సర్వేయర్లతోపాటు డిజిటల్ అసిస్టెంట్లు, విఆర్ఓలకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 275 బృందాలకు మొదటి విడతలో శిక్షణ ఇచ్చారు. వీరికి 50రకాల పని విధానాలపై శిక్షణ కొనసాగిస్తున్నారు. రీ సర్వేలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తుండటంతో ఇందుకు సంబంధించిన సాంకేతిక మెళకువలపై సర్వే సెటిల్‌మెంట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2023 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో భూముల సర్వే ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయడం సాధ్యమేనా? అనే ప్రశ్న ఉదయిస్తోంది. భూముల సర్వే ప్రక్రియ వేగవంతంగా జరగకపోవడానికి సవాలక్ష కారణాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం విడతల వారీగా ప్రకటించిన షెడ్యూల్ అమలు ఏ మేరకు సాధ్యమవుతుందనే అంశంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 17,460 రెవెన్యూ గ్రామాలు, 110 నగర, పట్టణాభివృద్ధి పరిధిలోని భూములు సర్వే చేసి హద్దులు నిర్ణయించడం చేయాలని నిర్ణయించారు. తొలి విడతలో 5,500, రెండో దశలో 6వేలు, మూడో దశలో మిగిలిన గ్రామాలు సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత పైలెట్ ప్రాజెక్టుగా నిర్ణయించిన 51 గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం ఇప్పటికే ఆయా గ్రామాల కొత్త రికార్డులను ప్రభుత్వం విడుదల చేసింది. రైతుల ఆమోదం తెలిపిన తర్వాత సర్వే పూర్తయిన భూములకు విశిష్ట సంఖ్యను అధికారులు కేటాయిస్తున్నారు. మరో 650 గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# సినీ కథా చిత్రం... కంటిన్యూ

హైదరాబాద్, జనవరి 4, (న్యూస్ పల్స్)సినిమా టికెట్ ధరలపై 2021 ఏప్రిల్‌లో జీవో నెంబర్ 35 విడుదల చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. అయితే, కరోనా కారణంగా సినిమాలు విడుదల కాకపోవడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ, ఇటీవల పెద్ద సినిమాలు రిలీజ్ అవుతుండడంతో ధరలు మరీ దారుణంగా ఉన్నాయని.. పెంచాలని నిర్మాతలు డిమాండ్ చేస్తూ వచ్చారు.అయితే, చర్చలతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్న సమయంలో హీరో నాని చేసిన కామెంట్లు కలకలం రేపాయి. సినిమా కలెక్షన్ల కంటే కిరాణా కలెక్షన్లు బాగున్నాయన్నారు. దీనికి కౌంటర్‌గా హీరోలు రెమ్యునరేషన్లు తగ్గించుకుంటే 80శాతం ఖర్చు తగ్గుతుందని మంత్రులు అనిల్ కుమార్ యాదవ్, బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. దీంతో మంత్రులపై హీరో సిద్దార్ద సంచలన ఆరోపణలు చేశారు. మీ మా పన్నులతో అనుభవిస్తున్న మీ విలాసాలు తగ్గించుకుని జనాలకు డిస్కౌంట్ ఇవ్వాలని సలహా ఇచ్చారు.ఇదే సమయంలో టికెట్ ధరలు మరీ తక్కువగా ఉన్నాయని నిర్వహణ సాధ్యం కాదని జీవోపై కొందరు థియేటర్ల యజమానులు కోర్టుకు వెళ్లడంతో వారి పిటిషన్‌ను సస్పెండ్ చేసింది న్యాయస్థానం. తీర్పు వచ్చిన తర్వాత సోదాలు చేసిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న థియేటర్లను మూసివేశారు. అయితే, కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు కూడా వచ్చాయి. ఒకరిద్దరిని టార్గెట్ చేసి మరీ ఇండస్ట్రీని దెబ్బకొడుతున్నారని ప్రభుత్వంపై విపక్షాలు ఆరోపణలు చేశాయి.వివాదం నడుస్తుండగానే సినిమాటోగ్రఫీ శాఖను పేర్ని నానికి అప్పగించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి. దీంతో రంగంలో దిగిన మంత్రి అధికారులతో కూడిన కమిటీ వేశారు. అటు ఇండస్ట్రీ పెద్దలు కూడా మరో కమిటీ వేశారు. సినిమా టికెట్ల ధరలు తగ్గించడం వెనక పేదవాళ్లకు తక్కువ ధరలో వినోదం అందించడమే తమ లక్ష్యమని సీఎం జగన్ ఇటీవల వ్యాఖ్యానించారు. పేదవాళ్లకు మంచి చేస్తుంటే కూడా తట్టుకోలేకపోతున్నారని విపక్షాలను ఎండగట్టారు సీఎం.

# అధికారుల అలసత్వం..నిర్లక్ష్యం

**వృథాగా మిగిలిపోయిన బయో మందులు**

నూజివీడు రైతులకు అందాల్సిన బయో మందుల ప్యాకెట్లు ఎక్స్పైరీ డేట్ అయిపోయి నిరు ఉపయోగంగా ఉన్న వైనం బయటకు వచ్చింది. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం సంబంధిన గోడంలో ఎక్స్పైరీ అయిన తోటలకు పిచికారీ చేసే బయో మందులు లభ్యం అయ్యాయి. అధికారుల నిర్లక్ష్యంతో సుమారు ఐదు లక్షల రూపాయల మందుల ప్యాకెట్లు ఎక్స్పైరీ అయిపోవడంతో రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. ఒక గ్రామంలోనే ఐదు లక్షల రూపాయల స్టాక్ ఉపయోగం లేకుండా పోయింది అంటే నియోజకవర్గంలో ఎన్ని చోట్ల ఇలా జరిగిందో ఉన్నతాధికారులు విచారించాలని రైతులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపుతున్న బయోటెక్ మందులు, ఎరువులు,ఇతర సామాగ్రి కిందిస్థాయి సిబ్బంది వల్ల రైతులకు అందకుండా పోయాయి. సుమారు 50 బాక్సుల్లో కొన్ని వేల ప్యాకెట్లు రైతు భరోసా కేంద్రంలో మీడియాకి చూపించి రైతులు వాపోతున్నారు.

# క్షుద్రపూజల కలకలం

గుంటూరు కరోనా కల్లోలంలోనూ క్షుద్రపూజలు ఆగడం లేదు. మహమ్మారికి వ్యాక్సిన్ కనిపెట్టాం కానీ.. ఈ మూఢనమ్మకాలకు ముగింపు పలకలేకపోతున్నాం. తాజాగా గుంటూరు జిల్లా అచ్చంపేటలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. అచ్చంపేట-మాదిపాడు ప్రధాన రహదారి తాళ్ళచెరువు అడ్డరోడ్డు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్ళు స్థానికులకు భయాందోళనలకు గురిచేశాయి. భయంకరంగా వరాహాన్ని బలి ఇచ్చి పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, చీర, చాటలతో పూజలు చేశారు. వరాహాన్ని గొంతుకోసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ప్రధాన రహదారిపై నిరంతరం వాహనాలు రద్దీ వున్నప్పటికీ పందిని చంపి క్షుద్రపూజలు చేయటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతరాత్రి అమావాస్య ఆదివారం కావడంతో.. పూజలు ఎక్కడైనా జరిపి ఇక్కడకు తెచ్చి పడవేశారా అన్న భావన స్థానికుల్లో నెలకొంది. అమావాస్య ఆదివారం రావటంతో క్షుద్ర పూజలు చేసే మంత్రగాళ్ళు రెచ్చిపోయారు. ఆదివారం రోజు వచ్చే అమావాస్యలో పూజలు చేస్తే క్షుద్ర దేవతలు కరుణిస్తారన్న మూఢ నమ్మకాలున్నాయి. ఈ క్రమంలోనే పూజలు చేసినట్లుగా భావిస్తున్నారు.

# జిల్లా నుంచి కోటి...

నెల్లూరు, జనవరి 4, (న్యూస్ పల్స్) 'మీరు కోచ్‌లేనా.. అయితే స్టేడియాలలో ఆడుకునేందుకు వచ్చే క్రీడాకారుల నుంచి అడ్మిషన్‌సహా ఫీజులు వసూలు చేయండి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులకూ మినహాయింపు లేదు. ప్లేయర్స్ డబ్బు చెల్లించలేకపోతే, వారి తరపున మీరే స్పాన్సర్లను పట్టుకుని డబ్బులు తీసుకోండి. ఏం చేస్తారో, ఏమో తెలియదు. ప్రతి జిల్లా నుంచి ఏడాదికి కనీసం రూ.కోటి ఇవ్వాల్సిందే..' ఇదీ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఉన్నతాధికారుల నుంచి జిల్లాల్లోని చీఫ్ కోచ్‌లు, జిల్లాల యువజన సర్వీసుల శాఖ సిఇఓలకు ఆదేశాలు వస్తున్నాయి. జిల్లాల్లోని స్టేడియాలలో కొద్ది రోజులుగా పీజుల అంశం పై చర్చలు జరుగుతు న్నాయి. పాఠశాలలు, కాలేజీలలో చదువుకునే విద్యార్థులను కూడా స్టేడియాలకు వచ్చి ఆడుకునేలా చేసి, వారి నుంచి ఫీజులు వసూలు చేయాలంటూ శాప్ ప్రొసీడింగ్స్‌ను జారీ చేసింది. ఈ విషయంపై శాప్‌లో ఇటీవల ఒక ఉన్నతస్థాయి సమావేశం కూడా జరిగింది. గతంలోనే ఉన్న పే అండ్ ప్లే స్కీంను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఆ సమావేశంలో పలువురు చీఫ్ కోచ్‌లు ఫీజులు వసూలు చేయడం కష్టమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. క్రీడాకారులు కట్టలేకపోతే, కోచ్‌లు, చీఫ్ కోచ్‌లే స్పాన్సర్లను పట్టుకోమని శాప్ సీనియర్ అధికారి ఒకరు సలహా ఇచ్చినట్లు తెలిసింది. స్విమ్మింగ్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటి ఖరీదైన క్రీడలకు 24 గంటలూ కోచింగ్ ఇవ్వాలని, ఇంటెరెస్ట్‌గా ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వండంటూ ఆదేశిం చారు. స్టేడియాలలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ప్రాక్టీస్ చేసినా సరే ఎలాంటి మినహాయింపు ఇవ్వొద్దని ఆదేశించినట్లు తెలిసింది.కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖో - ఖో వంటి క్రీడలు ఆడేవారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. స్కూల్స్, కాలేజీ ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లే మంచి ప్లేయర్స్‌ను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. ఇపుడు వారి నుంచి నెల, మూడు నెలలు, ఏడాదిపాటు ఫీజులు వసూలు చేయమని ఆదేశించడంతో ఏం చేయాలో పాలుపోవడంలేదని పలువురు కోచ్‌లు వాపోతున్నారు. 14 ఏళ్లలోపు క్రీడాకారులకు వెయ్యి వరకు అడ్మిషన్ ఫీజు, కనీసం రూ.15 నుంచి 400 వరకు నెలవారీ ఫీజు, 14 ఏళ్లు పైబడిన వారికి రూ.16 వేల వరకు అడ్మిషన్ ఫీజు, రూ.40 నుంచి రూ.3 వేల వరకు నెలవారీ ఫీజులు వసూలు వసూలు చేసేలా ప్రొసీడింగ్స్ వచ్చినట్లు తెలిసింది. అయితే, వీటిని ఇంత వరకు బహిర్గతం చేయలేదు.జిల్లాల్లో చాలా క్రీడాంశాలకు కోచ్‌లు లేరు, 13 జిల్లాల్లో శాప్ క్రికెట్ కోచ్ ఒక్కరే ఉండగా, స్విమ్మింగ్ కోచ్‌లు ఐదుగురే ఉన్నారు. టేబుల్ టెన్నిస్, టెన్నిస్ కోచ్‌లూ తక్కువే. కబడ్డీ, వాలీబాల్, హాకీ, ఆర్చరీ, బాక్సింగ్ కోచ్‌ల కొరత ఉంది. క్రీడా సంఘాలే చాలా వరకు సొంతంగా శిక్షణ ఇచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో క్రీడల బాధ్యతల నుంచి ప్రభుత్వం వైదొలగాలనే ఉద్దేశంతోనే క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కోచ్‌లు లేని స్పోర్ట్స్‌కు ఫీజులు ఎలా వసూలు చేయాలని, ఏడాదికి ఒక్కో జిల్లా నుంచి రూ.కోటి ఎలా వసూలు చేయాలోనని చీఫ్ కోచ్‌లు తర్జనభర్జనలు పడుతున్నారు. చాలా స్టేడియాలలో సౌకర్యాలే లేవు. అలాంటపుడు ఫీజుల వసూలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

# 317 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి



**టిపిసిసి నాయకులు జువ్వాడి కృష్ణారావు**

కోరుట్ల జనవరి 04తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన జోనల్ విధానాల అమలులో ప్రభుత్వ ఉద్యోగులు ,ఉపాధ్యాయుల విభజన బదిలీలకు సంబంధించిన 317 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు బాగాలేదని ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ గందరగోళంగా సాగుతుందని, స్థానికత విషయంలో ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేసేలా ఈ జీవో ఉన్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని 1969 నుండి జరిగిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ను సజీవంగా నిలిపినది తెలంగాణా ప్రజలను స్వరాష్ట్రసాధన దిశగా ముందుకు వెళ్ళడానికి భావజాల వ్యాప్తికి కృషి చేసిన ది ఉపాధ్యాయులేనని అలాంటి ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టె ఈ జీవో ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు.

# అంతరిక్ష కేంద్రంలో కరోనా కలకలం

నెల్లూరు, జనవరి 4, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లా శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో కరోనా కలకలం సృష్టిస్తోంది. సతీష్ ధవన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం (షార్)లో మళ్లీ కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఒక్కసారిగా యజమాన్యం ఉలిక్కిపడింది. తాజాగా షార్ లోని 14 మంది కి కరోనా నిర్ధారణ అయింది. గత నెల డిసెంబర్ నుంచి షార్ లో కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే షార్ లోని పనిచేస్తున్న సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా కరోనా బారినపడినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఓ డాక్టర్ కుటుంబానికి కూడా కరోనా పాజిటివ్ గా నిర్ధారణ కావడంతో అక్కడ అలజడి నెలకొంది. అయితే కొంతమంది ఒమిక్రాన్ అయి ఉండొవచ్చు అంటూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు.డిసెంబర్ 27న ఇద్దరికి కరోనా పాజిటివ్ రాగా.. ఆదివారం ఒకరు కరోనా బారినపడినట్టు సమాచారం. కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిన షార్ ఉద్యోగులు హోం క్వారంటైన్‌లో ఉంటూ చికిత్స తీసుకుంటున్నారు. సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కేఆర్పీ, డీఆర్డీఎల్ లో ఒక్కొక్కరుగా కరోనా బారినట్లు పడినట్లు తెలుస్తోంది. ఇక షార్ రిటైర్డ్ ఉద్యోగికి కూడా కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో షేర్ ఉద్యోగుల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

# ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు

విజయవాడ, జనవరి 4, (న్యూస్ పల్స్)ఏపీ ప్రభుత్వంపై మాజీ సీఎం చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. మంగళగిరిలో పార్టీ నేతలతో సమావేశం ముగిసిన తర్వాత ఆయన మాట్లాడుతూ? వైసీపీకి ప్రజలు నమ్మకంతో ఓటేస్తే.. జగన్ ఆ నమ్మకాన్ని ఒమ్ము చేశారని ఆరోపించారు. మద్య నిషేధం చేస్తామని చెప్పి ఈ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. న్యూఇయర్ రోజు ఒక్కరోజే రూ.124 కోట్ల అమ్మకాలు చేశారంటే మద్య నిషేధం ఎలా చేస్తారని ప్రజలను నమ్మమంటారని నిలదీశారు. సొంత మద్యం బ్రాండ్లతో అంతా దోచుకుని ఇప్పుడు ప్రీమియం కంపెనీల బ్రాండ్‌లను అమ్ముతామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పన్నుల పేరుతో ప్రజలను ఈ ప్రభుత్వం దోచుకుంటోందని చంద్రబాబు ఆరోపించారు. చివరకు చెత్తపైన కూడా పన్ను వేసిన ఏకైక ప్రభుత్వం ఇదేనని ఎద్దేవా చేశారు. ఇటీవల రాష్ట్రంలో గంజాయి సరఫరా ఎక్కువ కావడంతో డ్రగ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ఇతర రాష్ట్రాలు అవమానించే పరిస్థితి నెలకొందన్నారు. మరోవైపు ఏపీ ఆర్థిక పరిస్థితి నానాటికీ దిగజారుతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 4వ తేదీ వస్తున్నా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. ఏపీకి అప్పులు ఇవ్వడానికి బ్యాంకులు కూడా భయపడుతున్నాయన్నారు. ఎన్నికలకు ముందు రాజధానిగా అమరావతికి మద్దతు తెలిపి ఎన్నికలు అయ్యాక జగన్ మాట మార్చారని చంద్రబాబు విమర్శించారు. అమరావతిపై తాము రూ.10వేల కోట్లు ఖర్చుపెట్టామని.. అమరావతిలో భవనాలన్నీ ప్రస్తుతం నిరుపయోగంగా మారిపోయాయన్నారు. అమరావతిని విధ్వంసం చేయడం ద్వారా రూ. 2 లక్షల కోట్ల సంపదను నాశనం చేశారని మండిపడ్డారు.పోలవరంపై కాలయాపన చేసి రేట్లు పెంచారని? పోలవరం అసలు పూర్తవుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయని తెలిపారు. ఏపీలో ఉన్న పరిశ్రమలు ఒక్కొక్కటిగా వెళ్లిపోతున్నాయని? జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చి యువతను నిరుద్యోగుల పాలు చేశారని చంద్రబాబు ఆరోపించారు. ఏపీలో రోడ్లు అధ్వాన్నంగా మారాయని.. బిల్లులు మంజూరు చేయకపోవడంతో రోడ్ల మరమ్మతులకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని విమర్శించారు. ప్రజావేదిక విధ్వంసంతో మొదలైన వైసీపీ పరిపాలన? కొనసాగుతూనే ఉందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో టీచర్లు కావాలనిపిల్లలుఆందోళనచేసేపరిస్థితులుకల్పించారనిచంద్రబాబుమండిపడ్డారు.

# అక్కడ అలా.. ఇక్కడ ఇలా

విజయవాడ, జనవరి 4, (న్యూస్ పల్స్)మరో 10 రోజుల్లో సంక్రాంతి పండగ రానుంది. అతి పెద్ద పండగ కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు అందరూ సొంతూళ్ల బాట పడతారు. ఈ సందర్భంగా రైళ్లు, బస్సులు కిటకిటలాడుతుంటాయి. ఈ నేపథ్యంలో సంక్రాంతికి ప్రత్యేకంగా 6,970 బస్సులు నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ ప్రకటించింది. పండుగకు ముందు 4,145 బస్సులు, ఆ తర్వాత 2825 బస్సులను తిప్పనున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. జనవరి 8వ తేదీ నుంచి ఈ స్పెషల్ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అయితే స్పెషల్ బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలను ఏపీఎస్ఆర్టీసీ వసూలు చేయనుంది. హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు ప్రాంతాలకు 1500 బస్సులను ఏపీఎస్ఆర్టీసీ నడపనుంది.మరోవైపు టీఎస్ఆర్టీసీ కూడా సంక్రాంతికి ప్రత్యేక బస్సులను నడపనుంది. సొంతూళ్లకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం 4,360 బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల టీఎస్ఆర్టీసీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రత్యేక బస్సుల్లో 590 బస్సులను రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించింది. ఆదిలాబాద్, ఖమ్మం, భద్రాచలం, విజయవాడ, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు సహా ఏపీలోని పలు పట్టణాలకు, కర్ణాటక, మహారాష్ట్ర వైపు వెళ్లే బస్సులకు రిజర్వేషన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అయితే టీఎస్ఆర్టీసీ మాత్రం అదనపు ఛార్జీలు లేకుండానే పండుగకు ప్రత్యేకంగా బస్సులను నడపనుంది.

**ఆర్టీసీ టిక్కెట్ల ధరలు తగ్గిస్తారా**

ఏపీలో సినిమా టిక్కెట్ రేట్ల అంశం హాట్‌టాపిక్‌గా నడుస్తోంది. ఇప్పటికే దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఏపీ ప్రభుత్వంపై ట్వీట్ల వర్షం కురిపిస్తున్నాడు. తాజాగా జనసేన పార్టీ సమావేశంలోనూ ఆ పార్టీ నేత నాదెండ్ల మనోహర్ సినిమా టిక్కెట్ల విషయాన్నే ప్రస్తావించారు. ఏపీలో సినిమా టిక్కెట్ల అంశం తప్ప సీఎం జగన్‌కు ఇంకేం తెలియదా అంటూ ప్రశ్నించారు. జగన్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే సిమెంట్ రేట్లు, ఇసుక రేట్లను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

మరోవైపు సొంత రాష్ట్రంలో ఉపాధి లేకపోవడంతో ఏపీలోని ప్రజలు పలు ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు, పనులు చేసుకుంటున్నారని.. అలాంటి వారు సంక్రాంతి పండక్కి ఆర్టీసీ బస్సుల్లో రావాలంటే భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వారు ప్రయాణించే బస్సుల్లో టిక్కెట్ ధరలను ఇష్టం వచ్చినట్లు 50 శాతం పెంచేశారని? సామాన్యుల కోసం ఆర్టీసీ టిక్కెట్ ధరలను తగ్గించే దమ్ము జగన్‌కు ఉందా అని నాదెండ్ల మనోహర్ నిలదీశారు. నిత్యావసర ధరలతో ప్రజలు అల్లాడిపోతుంటే అవి పట్టించుకోవడం మానేసి? సినిమా టిక్కెట్ ధరలను తగ్గించడమేంటని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# ఏజెన్సీలో పర్యాటకుల సందడి

విశాఖపట్నం జనవరి 4, (న్యూస్ పల్స్) విశాఖ ఏజెన్సీలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెల కొంది.అనంతగిరి మండలంలోని డముకు వ్యూ పాయింట్, బొర్రా గుహలు, కటికి, తాటిగుడ జలపాతాలు పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి.జి.మాడు గుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలోని లంబ సింగి, తాజంగి రిజర్వాయర్ ప్రాంతాలకు మైదాన ప్రాంతాల నుంచి పర్యా టకులు తరలివచ్చారు.అక్కడి ప్రకృతి అందాలను వీక్షించి పరవశించిపోయా రు.డుంబ్రిగుడ మండలంలో ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన చాపరాయి జల పాతం వద్దకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చా రు. సరదాగా జారుతూ.. స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు.

# పార్టీ వ్యతిరేక చర్యలపై కఠినంగా వుంటాం

విజయవాడ జనవరి 4, (న్యూస్ పల్స్) మైలవరం నియోజకవర్గం లో వసంత కృష్ణ ప్రసాదే ఎమ్మెల్యే. భవిష్యత్తులో కూడా ఆయనే పార్టీ అభ్యర్థిగా ఉంటారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వసంత కృష్ణ ప్రసాద్ కు వ్యతిరేకంగా పని చేస్తే పార్టీకి వ్యతిరేకంగా పని చేసినట్టే. అలాంటి వారిపై పార్టీలో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జోగి రమేష్ పెడన ఎమ్మెల్యేగా ఉన్నారు... ఆయన అక్కడ కొనసాగుతారు. వారిద్దరి మధ్య అనవసర విభేదాలు సృష్టిస్తే ఉరుకొమని అన్నారు. అలా ఎవరైనా చేస్తే వారిని పార్టీ నుండి బయటకు పంపేందుకు కూడా వెనుకాడం. అందరూ కలిసి మెలిసి పని చేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుంది. అనవసర వివాదాలకు దారితీసే చర్యలు ఉపసంహరించాలని అయన సూచించారు.

# జడ్పీ చైర్మన్ గా పాపిరెడ్డి ఎన్నిక

కర్నూలు జనవరి 4, (న్యూస్ పల్స్) కర్నూలు జిల్లా జడ్పీ చైర్మన్ గా ఎర్రబోతుల పాపిరెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం నాడు జడ్పీ ఎన్నిక కోసం సమావేశం నిర్వహించారు. పాపిరెడ్డి పేరును మహానంది జడ్పిటిసి సభ్యుడు కె ఆర్ మహేశ్వర్ రెడ్డి ప్రతిపాదించగా, మిడ్తూరు జడ్పీటీసీ సభ్యుడు పి.యుగంధర్ రెడ్డి, వెల్దుర్తి జడ్పిటిసి సుంకన్న లు బలపరిచారు. జడ్పీ చైర్మన్ గా ఎర్రబోతుల పాపిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు ప్రకటించారు. ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిచే అయన ప్రమాణ స్వీకారం చేయించారు. ధృవీకరణ పత్రాన్ని అందజేసారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ , ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి , ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ల్, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బ్రిజేంద్ర నాథ్ రెడ్డి , పత్తికొండ ఎమ్మెల్యే కె శ్రీదేవి , మరియు జడ్పీటీసీ సభ్యులు, కోఆప్టెడ్ సభ్యులు హాజరయ్యారు

# వనమా రాఘవను ఆరెస్టు చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం బీజేపీ మహిళామోర్చా ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమం జరిగింది. పాత పాల్వంచ ఆత్మహత్య ఘటనలో నిందితుడిగా ఉన్న వనమా రాఘవ వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ తదితరులు పాల్గోన్నారు.

# ఆనం ఇంటికి మంత్రి గౌతం రెడ్డి

నెల్లూరు వైసిపి లిటిల్ రెబల్ ఎమ్మేల్యే మాజీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని బుజ్జగించే పనిలో వైసిపి అధిష్టానం వుంది. ఇటీవల పోలీసులు మాఫియాతో కలిసి పనిచేస్తున్నారని అనం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. గతంలో నెల్లూరు మాఫియా లకు,దౌర్జన్యాలకు అడ్డాగ మారిందని అనం విమర్శించారు. ఆనం మాఫియా వ్యాఖ్యలు ఎపిలో అరాచక పాలనకు అద్దం పడుతున్నాయనే భావనలో ప్రజలు వున్నారు. ఇటీవల కార్పోరేషన్ ఎన్నికల్లో నెల్లూరు లో ఆనం ను వైసిపి లీడర్స్ సైడ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆనం ను బుజ్జగించేందుకు మాజీమంత్రి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి నివాసానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి చేరుకుని అయనతో మాట్లాడారు. తన ఇంటికి వచ్చిన సందర్భంగా మేకపాటి గౌతమ్ రెడ్డి ని ఆనం ఘనంగా సత్కరించారు. ఇరువురు నేతల మధ్య సుమారు అరగంటసేపు వివిధ అంశాలపై చర్చ జరిగింది. ..

# కులాలవారిగా పాఠశాలలు

కాకినాడ తూర్పు గోదావరి జిల్లా బ్రహ్మ పురి గ్రామంలో గల మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పట్ల కుల వివక్షత వైనం బయటపడింది. అగ్నికుల క్షత్రియ కులానికి చెందిన విద్యార్థులందరికీ ఒక పాఠశాల, ఇతర కులాలకు చెందిన విద్యార్థులకు మరో పాఠశాల ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ విధంగా కుల వివక్షతకు మండల విద్యాశాఖ అధికారులు ఆజ్యం పోసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే, గ్రామ పంచాయితీ సర్పంచ్ సూచనలు మేరకు విద్యార్థుల మధ్య కుల విభజన చేసారంటూ జిల్లా కలెక్టర్ కు అగ్నికుల క్షత్రియ కులసంఘ నాయకులు పిర్యాదు చేసారు. పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. గ్రామంలో ఒకే పాఠశాల ను కొనసాగించాలని, అన్ని సామాజిక వర్గాలకు చెందినవిద్యార్థులు అంతా ఒకే పాఠశాలలో చదువుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు.

## పిఠాపురంలో వ్యాక్సినేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా టీనేజర్లకు వ్యాక్సిన్ వేసేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా పిఠాపురం పట్టణంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు టీనేజర్లకు తొలివిడత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు..స్థానిక ఎస్.ఎఫ్.ఎస్.స్కూల్లో ఏర్పాటుచేసిన ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దొరబాబు ప్రారంభించగా.,15 నుంచి 19 సంవత్సరాలలోపు వయసు కలిగిన విద్యార్థులకు వైద్య,ఆరోగ్య సిబ్బంది కోవాక్జిన్ టీకాను వేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మీడియాతో మాట్లాడారు..కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మాగాపు రామ్మోహనరావు,ఎంపీడీఓ డీ.ఎల్.ఎన్.శర్మ,ఎంఈఓ ప్రసాద్,గండేపల్లి బాబీ,బుర్రా అనుబాబు,గుబ్బల తులసీకుమార్,బొజ్జా దొరబాబు,బాలిపల్లి రాంబాబు,పాలిక ప్రవీణ్ కుమార్,కొత్తపల్లి బుజ్జి,కొట్టేటి రాజేశ్,నడిగట్ల చింతలరావు,పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

## రెండవ వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా...

### ఎస్.ఓ శేషయ్య

తుగ్గలి జనవరి 4, ( విభారె) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రెండవ మండల ఉపాధ్యక్షునిగా ఎన్నుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు జిల్లా వ్యాప్తంగా మంగళవారం రోజున ఎన్నికలను నిర్వహించారు. మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు మంగళవారం



రోజున స్పెషలాఫీసర్ శేషయ్య ఆధ్వర్యంలో రెండవ మండల ఉపాధ్యక్షుని ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు.కానీ రెండవ మండల ఉపాధ్యక్షుని ఎన్నిక కు గౌరవ సభ్యుల కోరం లేనందున సమావేశాన్ని ఐదవ తేదీ అనగా గురువారం రోజుకు వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.గురువారం రోజున 11గంటలకు రెండవ మండల ఉపాధ్యక్షుని ఎన్నికను నిర్వహిస్తామని,గౌరవ ఎంపీటీసీ సభ్యులు అందరూ హాజరు కావాలని స్పెషలాఫీసర్ శేషయ్య తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీర రాజు,పరిపాలనాధికారి పార్థసారథి,పిఆర్ఏఈ వెంకటేశ్వర్లు, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు సమాజానికి ఆప్తులు...

### అమ్మ హాస్పిటల్ అధినేత డాక్టర్ త్రినాథ్

కర్నూలు జనవరి 4, ( విభారె) నేడు రాయలసీమ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ కాలమాన పట్టిక-2022 ను అమ్మ హాస్పిటల్ అధినేత డాక్టర్ త్రినాథ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ త్రినాథ్ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి ఆప్తులని,ఇతరుల సమస్యలను వార్తలుగా రాస్తారేతప్పా తమ సమస్యలను పట్టించుకోరని, జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివని ఆయన తెలియజేశారు.ప్రతి ఒక్కరూ పాత్రికేయులకు సహకరించాలని అన్నారు.అలాగే పాత్రికేయులు సమాజాన్ని పరిరక్షించడమే కాక తమ ఆరోగ్యాలను మరియు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యాలను కాపాడుకోవాలని తెలియజేశారు. ప్రకటనలు ఉన్నా లేకున్నా ప్రతి సంవత్సరం యూనియన్ క్యాలెండర్ను ప్రచురించడం అభినందించదగ్గ విషయమని తెలియజేశారు. అనంతరం రాయలసీమ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పాత్రికేయులకు సహకరించిన అధికారులకు,వైద్యులకు మరియు పారిశ్రామిక వ్యక్తులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం నగర అధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ పాత్రికేయులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను అందజేసి,అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.



# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే సైనికులు

## జిల్లా ఉపాధ్యక్షులు మాధవ స్వామి



నందవరం జనవరి 4, ( విభారె) మండలం పరిధిలో కార్యకర్తలు అంటే పార్టీకి సైనికులు వంటి వాళ్ళని పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉ ండి ఉన్న దానితో నిమిత్తం లేకుండా పార్టీని అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ స్వామి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా అని అలాంటి కార్యకర్తలు మంచి చెడులను చూడడం పార్టీ విధంగా నేను భావిస్తున్నానని అన్నారు వైసీపీ ప్రభుత్వం కరోనా కష్టకాలంఓ ప్రజలకు అండగా ఉండాలని ఉండాల్సిన సమయంలో ధరలు పెంచి దండుకోవడం ఏమాత్రం సమంజసం కాదని ఆర్థికంగా ప్రజలకు ఇబ్బంది పెడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులపై కార్యకర్తల పై తప్పుడు కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ స్వామి మాట్లాడుతూ రాజకీయాల్లో ఎవరు శాశ్వతం కాదని ఇబ్బందులకు గురి చేసే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు రైతులకు ఉచితంగా బోరు కౌలు రైతులకు వడ్డీలేని రుణాలు కానీ ఇంతవరకు అమలు కాలేదని అలాగే రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ హామీ ఇచ్చారని కానీ కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో విద్యుత్ అధికారులు కూడా తెలియదని అన్నారు రైతుల కోసం మూడు వేల కోట్లతో ధరలు స్థిరీకరణ నిధి ఏమైపోయిందని అధిక విద్యుత్ ఛార్జీలను వసూలు చేయడంలో ఈ ప్రభుత్వం ముందునీదని ఎద్దేవా చేశారు ఇసుక , విద్యుత్ ,పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ఎద్దేవా చేశారు ఆర్టీసీ చార్జీలు పెంచడం మరుగుదొడ్లకు పన్నులు వేస్తూ చెత్త పై పన్ను వేస్తూ ప్రజల దగ్గర నుంచి అడ్డగోలుగా దోచుకుంటుందని విమర్శించారు. రైతులకు సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తామని ఇంత వరకు ఏ ఒక్క రైతుకు కూడా ఈ వడ్డీ రుణాలు అందజేయలేదు అని రకాల వ్యాధులు ఆరోగ్య శ్రీ పరిధిలోకి తీసుకురాలేదని వృద్ధాప్య పింఛన్ 3వేలుకు పెంచుతామని చెప్పి వరకు కూడా 2500 మాత్రమే ఇస్తున్నారు నిత్యవసర ధరలను పెంచి సామాన్య మానవుడి నడ్డి విరుస్తున్నారని ఈ రాష్ట్ర ప్రభుత్వం మూడు దశల్లో మద్యపానం నిషేధం అని చెప్పి ఈ రోజు రకరకాల బ్రాండ్ పేరుతో ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారే తప్ప ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదన్నారు ఖాళీగా ఉన్న లక్షా 30వేల ఉద్యోగాలు భర్తీ అని చెప్పి నిరుద్యోగులకి చాలీ చాలని జాబ్ క్యాలెండర్ జాబులు విడుదల చేసి నిరుద్యోగులను ఆగ్రహానికి గురి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఈరన్న గౌడ్, మాజీ సర్పంచ్ కాసిం వల్లి ,గడ్డం నారాయణ, గోపాల్, పెద్ద రాముడు ,చిన్న రాముడు, లచ్చప్ప, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్ల పంపిణి



నందికొట్కూర్ ( జనవరి 4, ( విభారె)నందికొట్కూరు:పట్టణంలో 2వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కొత్త పింఛన్లను వితంతువులకు వయోవృద్దులు లబ్బిదారులకు స్వయంగా 2వ వార్డ్ కౌన్సిలర్ మొల్ల జాకీర్ హుస్సేన్ గారి అద్వర్యం పింఛన్లు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని మహా నాయకుడు మన ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు అని అన్నారు.అర్హులైన ప్రతి అవ్వా తాత కళ్ళలో ఆనందం చూడాలనే తపనతోనే వారికీ ఆర్థికంగా భరోసా కలిగించే విదంగా 2,250 రూపాయలతో పాటు మరో రెండు వొందల యాభై రూపాయలు పెంచిన డబ్బుతో కలిపి మొత్తం 2,500 పెన్షన్లు 2వ వార్డ్ కౌన్సిలర్ అందజేశారు.ఈ కార్యక్రమం లో వైస్సార్సీపీ నాయకులు రహంతుల్లా,ముజీబ్,శాలిమియా,ఆజం,రియాజ్. అలాగే 2వ వార్డ్ సచివాలయ అడ్మిన్ మహేష్,సచివాలయ సిబ్బంది,వార్డ్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు ఘనంగా..

.నందికొట్కూరు జనవరి 4, ( విభారె) కర్నూలు జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన అభిమానుల మధ్య డాక్టర్ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు మంగళవారం నాడు కర్నూల్ సంతోష్ నగర్ లోని బైరెడ్డి ఫంక్షన్ హాల్ నందు రాయలసీమ ముద్దుబిడ్డ శ్రీమతి డాక్టర్ బైరెడ్డి శబరి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యంగా నందికొట్కూర్ బిజెపి నందికొట్కూరు అసెంబ్లీ ఇంచార్జ్ కొండేపోగు చిన్న సుంకన్న సకుటుంబ



సమేతంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అలాగే ఈరోజు నందికొట్కూర్ నియోజకవర్గం ప్రజలు బైరెడ్డి అభిమానులు బీజేపీ కార్యకర్తలు బైరెడ్డి శబరి అమ్మ సైన్యం నెహ్రూ నగర్, నందికొట్కూరు, ముచ్చుమర్రి, నందికొట్కూరు మండలం కోళ్లబావా పురంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు,పాణ్యం నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఓర్వకల్, పాణ్యం, గడివేముల,కల్లూర్ మండలాలలో శ్రీమతి డాక్టర్ బైరెడ్డి శబరి అమ్మగారి పుట్టినరోజును ఘనంగా కేకులు కట్ చేసి బాణాసంచాలు పేల్చుతూ, అయ్యప్ప స్వాములకు పూజ బిక్ష ఏర్పాటు చేయడం జరిగింది. తర్వాత జన్మదిన వేడుకల్లో భాగంగా క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన డాక్టర్ బైరెడ్డి శబరి అమ్మ గారు... ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గం పాణ్యం నియోజకవర్గం బిజెపి నాయకులు, కార్యకర్తలు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, బైరెడ్డి అభిమానులు ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## పట్టుబడిన వాహనాలకు వేలం పాట

### ఆర్టీఓ క్రిష్ణారావు

నంద్యాలజనవరి 4, ( విభారె) :- అటోనగరంలో ఉన్న ఆర్టీఓ ఆఫీసు యందు వివిధ రకాల వాహనాలను 6 వతేదిన వేలం పాట నిర్వహించు చున్నామని ప్రాంతీయ రవాణా అధికారి క్రిష్ణారావు ఓ ప్రకటనలో మంగళవారం నాడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ పోలీసు



స్టేషన్లలో ఉన్న వివిధ రకాల వాహనాలను వేలం పాట నంద్యాల ఆర్టీఓ కార్యాలయం లో ఏర్పాటు చేసినామని ఆయన చెప్పారు. వేలం పాట పాడదలసినవారు 5 వేల రూపాయల డిపాజిట్లు కట్ట వలెనని తెలిపారు. వేలం పాట అయి పోయిన తరువాత డిపాజిట్లు వాపసు ఇ స్తామని తెలిపారు. వేలం పాట పాడదలసిన వారు వివిధ స్టేషన్ లో ఉన్న వాహనాలను పరిశీలించు కోవాలని సూచించారు. వివిధ స్టేషన్లలో . మొత్తం 60 వాహనాలు ఉన్నాయని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రామ్చరణ్ ఎన్టీఆర్ ఒత్తిడికి గురవుతున్నారా?





ఎస్.ఎస్. రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన భారీ 'ఆర్ ఆర్ ఆర్'. యంగ్ టైగర్ ఎన్టీఆర్ మెగా పవర్ స్టార రామ్ చరణ్ తొలిసారి కలిసి నటించిన ఈ మూవీ సంక్రాంతి బరిలో ఈ నెల 7న విడుదల కావాల్సిన విషయం తెలిసిందే. అయితే దేశ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో కోవిడ్ ఒమిక్రాన్ కేసులు పెరుగుతున్న దరిమిలా ఈ మూవీ రిలీజ్ ని వాయిదా వేస్తున్నట్టుగా చిత్ర బృందం ప్రకటించిన విషయం తెలిసిందే.భారీ స్థాయిలో ప్రమోషన్స్ చేసి సినిమాపై హ్యూజ్ క్రేజ్ క్రియేట్ అయిన తరువాత రిలీజ్ వాయిదా కావడంతో సినీ ప్రియులు ఆవేదనకు గురవుతున్నారు. మళ్లీ రిలీజ్ డేట్ ఎప్పుడు ప్రకటిస్తారన్న విషయంలో ఇప్పటికీ క్లారిటీ లేదు. ప్రస్తుతం క్రియేట్ అయిన క్రేజ్ ని మళ్లీ రీ క్రియేట్ చేయడం కష్టం. ఈ నేపథ్యంలో సినీ ప్రియుల తరహాలోనే చిత్ర హీరోలు రామ్ చఱణ్ ఎన్టీఆర్ కూడా ఒత్తిడికి గురవుతున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.ఈ మూవీ రిలీజ్ కోసం దేశ వ్యాప్తంగా ప్రధాన సిటీలకు వెళ్లి ఏ వేదిక లభిస్తే ఆ వేదికపై 'ఆర్ ఆర్ ఆర్' ని రాజమౌళితో కలిసి ప్రమోట్ చేశారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ వరకు 'ఆర్ ఆర్ ఆర్' ప్రమోషన్స్ కోసం క్షణం తీరిక లేకుండా గడిపేసిన హీరోలు ఒక్కసారిగా వాతావరణం న్యూ ఇయర్ తరువాత మారిపోవడంతో తీవ్రర ఒత్తిడికి గురవుతున్నారట.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం 'ఆర్ ఆర్ ఆర్' రిలీజ్ వాయిదా ప్రకటన తరువాత రామ్ చరణ్ ఎన్టీఆర్ ఎవరినీ కలవడానికి ఇష్టపడటం లేదట. జాతీయ స్థాయిలో దేశ వ్యాప్తంగా 'ఆర్ ఆర్ ఆర్ ' ప్రమోషన్స్ తో చరణ్ తారక్ మెరిశారు. చాలా హుషారుగా ప్రమోషన్స్లో పాల్గొన్నారు. అంతే హుషారుగా ప్రమోషనల్ ఈవెంట్స్ కూడా హ్యూజ్ సక్సెస్ అయ్యాయి. అయితే ఆ తరువాతే అన్నీ మారిపోయాయి. జనవరి 7న విడుదల కావాల్సిన 'ఆర్ ఆర్ ఆర్' రిలీజ్ అనూహ్యంగా వాయిదా పడింది.డిజప్పాయింట్ అయ్యారన్నది చాలా చిన్నపదమని ఊహించని వార్త వినడంతో చరణ్ ఎన్టీఆర్ డిప్రెషన్ లోకి వెళ్లిపోయారని వారితో సన్నిహితంగా వుండే వారు చెబుతున్నారు. ఎన్టీఆర్ ని మించి చరణ్ చాలా ఫీలయ్యాడని తెలుస్తోంది. ఎన్టీఆర్ సోషల్ మీడియాలో న్యూ ఇయర్ విషెస్ తెలియజేశాడు. చరణ్ మాత్రం అసలు ట్వీటే చేయలేదు. దీంతో చరణ్ ఎంతలా డిప్రెషన్ కు గురయ్యాడో అర్థం చేసుకోవచ్చు అంటున్నారు.అంతేనా న్యూ ఇయర్ సందర్భంగా విడుదల చేసిన 'ఆచార్య' ఫస్ట్ సింగిల్ ప్రోమోని కూడా చరణ్ పట్టించుకోలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జక్కన్న కూడా చాలా డిప్రెషన్ కి గురవుతున్నట్టుగా తెలుస్తోంది. ఆయన కూడా ట్విట్టర్ వేదికగా ఎలాంటి ట్వీట్ చేయకపోవడం గమనార్హం.

## అదిరిపోయే ఐటమ్ లో మెరిసిపోయే భామ ఎవరో!

యశ్ హీరోగా కన్నడలో రూపొందిన 'కేజీఎఫ్' సంచలన విజయాన్ని సాధించింది. సరైన కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా బాక్సాఫీస్ ను దడదడలాడించవచ్చని నిరూపించిన సినిమాల్లో ఇది ఒకటి. ఈ సినిమాతో దర్శకుడిగా ప్రశాంత్ నీల్ .. హీరోగా యశ్ తిరుగులేని క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. 'కేజీఎఫ్' వసూళ్ల వర్షాన్ని కురిపించడం .. సీక్వెల్స్ ను వరుసగా చేస్తూ వెళ్లే మూలకథ ఉండటం వలన మళ్లీ రంగంలోకి దిగేసి 'కేజీఎఫ్ 2'ను రూపొందించారు. ఈ వేసవిలో ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం ఒక సూపర్ హిట్ సాంగ్ ను రీ మిక్స్ చేసినట్టుగా తెలుస్తోంది. 'షోలే' సినిమాలోని 'మెహబూబా మెహబూబా' అనే సాంగుని రీమిక్స్ చేసినట్టుగా చెబుతున్నారు. అమితాబ్ .. ధర్మేంద్ర .. సంజయ్ కపూర్ .. హేమమాలిని .. అంజాద్ ఖాన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఆ సినిమా అప్పట్లో చరిత్ర సృష్టించింది. ఈ సినిమాకి ఆర్డీ బర్మన్ అందించిన సంగీతం సినిమా విజయంలో కీలకమైన పాత్రను పోషించింది. ముఖ్యంగా ఆ సినిమాలో నైట్ ఎఫెక్ట్ లో చిత్రీకరించిన 'మెహబూబా మెహబూబా' అనే ఐటమ్ సాంగ్ ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది.అంజాద్ ఖాన్ ఇలాకాలో హెలెన్ బృందంపై చిత్రీకరించిన ఈ పాట జనంలోకి ఒక రేంజ్ లో దూసుకుపోయింది. అలాంటి పాటను 'కేజీఎఫ్ 2' కోసం రీమిక్స్ చేశారని అంటున్నారు. అప్పట్లో యూత్ ను ఒక ఊపు ఊపేసిన ఈ సాంగు రీమిక్స్ ను ఈ సినిమాలో హీరోయిన్ పై చిత్రీకరించరేది ఆసక్తికరంగా మారింది. త్వరలోనే ఈ విషయాన్ని రివీల్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఆర్డీ బర్మన్ స్వరపరిచిన సాంగ్ ను టచ్ చేయడమనేది అంత ఆషామాషీ విషయమేం కాదు. పైగా అది బాగా పాప్యులర్ అయిన పాట. మరి 'కేజీఎఫ్ 2'కి సంగీతాన్ని అందించిన రవి బస్రూర్ ఈ విషయంలో ఎంతవరకూ సక్సెస్ అవుతాడనేది చూడాలియశ్ .. సంజయ్ దత్ .. రవీనా టాండన్ .. ప్రకాశ్ రాజ్ .. శ్రీనిధి శెట్టి ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా సంజయ్ దత్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలవనున్నాడు. ఆయన రాకతో ఈ సినిమా భారీతనం మరింత పెరిగిందని అంటున్నారు.


# పాపం బుమ్రా, షమిని ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు..

## కానీ శార్దూల్.. అస్సలు ఊహించలేదు కదా!



దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో 'లార్డ్' శార్దూల్ ఠాకూర్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. వరుస విరామాల్లో వికెట్లు కూల్చి ప్రొటిస్ను దెబ్బకొడుతున్నాడు. ఇప్పటికే మూడు కీలక వికెట్లు తన ఖాతాలో వేసుకున్న శార్దూల్ పదునైన బంతులతో సౌతాఫ్రికా బ్యాటర్లను బెంబేలెత్తిస్తున్నాడు. మ్యాచ్ను టీమిండియా వైపు తిప్పే దిశగా దూసుకుపోతున్నాడు. ఈ క్రమంలో ఈ యువ ఆటగాడిపై సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురుస్తోంది. "లార్డ్ శార్దూల్... టీమిండియా ఫెయిర్ ప్లేను నమ్ముతుంది. అందుకే లార్డ్ ఎప్పుడూ కొత్త బ్యాటర్లకు బౌల్ చేయడు. ప్రత్యర్థి జట్టు భారీ భాగస్వామ్యాలు నమోదు చేస్తున్న సమయంలో రంగంలోకి దిగుతాడు. వాళ్లను అవుట్ చేసేస్తాడు"అంటూ టీమిండియా మాజీ క్రికెటర్ వసీం జాఫర్ శార్దూల్ను ఆకాశానికెత్తాడు. ఇక ఇర్ఫాన్ పఠాన్ సైతం... శార్దూల్ అద్భుతంగా బౌల్ చేస్తున్నాడంటూ ప్రశంసించాడు. ఇంకొంత మంది నెటిజన్లు... "పాపం దక్షిణాఫ్రికా బుమ్రా, షమీ, అశ్విన్ బౌలింగ్ ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రచించింది. కానీ లార్డ్ శార్దూల్ ఠాకూర్ రంగంలోకి దిగాడు. అవుటాఫ్ సిలబస్ కదా"అంటూ ఫన్నీ మీమ్స్ షేర్ చేస్తున్నారు. ఇక అభిమానులైతే.. "తక్కువ అంచనాలు.. అత్యద్భుతంగా రాణింపు.. అదీ మరి శార్దూల్ అంటే! నిజమైన పేసు గుర్రం అతడు" అంటూ మురిసిపోతున్నారు. కాగా వాండరర్స్లో జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆటలో భాగంగా కెప్టెన్ ఎల్గర్, పీటర్సన్, వాన్ డెర్ డసెన్ వికెట్లు తీసి లంచ్ బ్రేక్ సమయానికి ముందు శార్దూల్ ఈ టీమిండియా శిబిరంలో జోష్ నింపాడు.

## ఐపీఎల్ మెగా వేలం వేదిక, తేదీలు మార్పు.. ఎందుకంటే!



క్రికెట్ ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఐపీఎల్- 2022 మెగా వేలం నిర్వహణ వాయిదా పడే సూచనలు కనిపిస్తున్నాయి. అదే విధంగా వేదిక సైతం బెంగళూరు నుంచి మార్చనున్నట్లు సమాచారం. కర్ణాటక ప్రభుత్వ తాజా కోవిడ్ నిబంధనల నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వేదిక మార్పు తప్పనిసరి అయితే... కోల్కతా, కొచ్చి, ముంబైలలో ఏదో ఒక నగరంలో వేలం నిర్వహించాలని భావించినా ఆయా చోట్ల కూడా కరోనా కేసుల్లో పెరుగదల కారణంగా ఆలోచన మార్చుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ముందుగా నిర్ణయించినట్లుగా ఫిబ్రవరి 12, 13 తేదీల్లో కాకుండా కొత్త తేదీలను ఖరారు చేసే యోచనలో బీసీసీఐ ఉన్నట్లు సమాచారం. తాజా కోవిడ్ నిబంధనల కారణంగా హోటళ్లలో గదులు బుకింగ్ ఆలస్యమవుతుండటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయాల గురించి బీసీసీఐ సీనియర్ అధికారి ఇన్సైడ్ స్పోర్ట్తో మాట్లాడుతూ... "మన చేతుల్లో ఏమీ ఉండదు. కొన్నిసార్లు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయి. వేచిచూడక తప్పదు. కోవిడ్ నిబంధనలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం.ఆయా రాష్ట్రాల క్రికెట్ అసోసియేషన్ల అధికారులతో మాట్లాడుతున్నాం. ఒకవేళ వేదిక మార్చాల్సి వస్తే తప్పక అన్ని విధాలుగా ఆలోచించిన తర్వాతే నిర్ణయాన్ని ప్రకటిస్తాం"అని పేర్కొన్నారు. కాగా ప్రొ కబడ్డీ లీగ్ బెంగళూరులో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ వైట్ఫీల్డ్ హోటల్లోని షెరాటన్ గ్రాండ్ను నిర్వాహకులు ఉపయోగించుకుంటున్నారు.మిగతా హోటళ్లు అందుబాటులో ఉన్నా గురువారం నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో సామూహిక సమావేశాలకు అనుమతి కష్టంగానే మారనుంది. ఇక ఐపీఎల్ మెగా వేలం అంటేనే వందల సంఖ్యలో అధికారులు హాజరవుతారు. కాబట్టి కర్ణాటక ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వేదిక మార్చాలా వద్దా అన్న అంశాన్ని బీసీసీఐ పరిశీలిస్తోంది.

## సూపర్ శార్దూల్.. ఐదో వికెట్ డౌన్

శార్దూల్ మరోసారి అద్భుతం చేశాడు. ఇప్పటికే 3 వికెట్లు తీసిన అతడు.. వెరెనె వికెట్ను తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో ప్రొటిస్ ఐదో వికెట్ కోల్పోయింది. 21 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద వెరెనె ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. స్కోరు: 162-5.ప్రొటిస్ జట్టు ప్రస్తుత స్కోరు: 145/4.దక్షిణాఫ్రికా బ్యాటర్లు ఆచితూచి ఆడుతున్నారు. కైలీ వెరెనె 14, తెంబా బవుమా 15 పరుగులతో క్రీజులో ఉన్నారు. ప్రస్తుత స్కోరు: 132/4 టీమిండియా బౌలర్ శార్దూల్ ఠాకూర్ ప్రొటిస్ జట్టును దెబ్బ మీద దెబ్బ కొడుతున్నాడు. మూడు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. ఎల్గర్, పీటర్సన్, వాన్ డెర్ డసెన్ను పెవిలియన్కు పంపాడు. దీంతో లంచ్ బ్రేక్ సమయానికి దక్షిణాఫ్రికా నాలుగు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**